


శ్రీ సి. సి. పున్నయ్య

డాక్టరు రామకృష్ణగారు సంపన్నులు. దానికితోడు మంచి ఆదాయం, పలుకుబడీ యున్నవి ఆయూళ్లో. వాళ్లు నివసిస్తున్నది పెద్ద భవనం. ఇంటిముందు అందమైన పూలతోట, విశాలము ఉన్నవి. డాక్టరు గారి అమ్మాయి సరళకు 7 ఏండ్ల వయస్సుండేది. సాయంకాలము వేళల్లో తోటలో గెంతుతూ పరుగెత్తుతూ ఆడుకుంటుండేది. ఒక్కతే కూతురయి వేరే సంతానం లేకపోవడంవలన తల్లిదండ్రులు చాల గారాబంగా పెంచుతుండేవారు. డాక్టరుగారు ఎక్కడ తిరిగివచ్చినా సరళకనుపించకపోతే సీతా! "సరళఏది" అని అడిగేవాడు.

సరళ బళ్లోకి పోయివచ్చి, బళ్లో దారిన చూచినవి విన్నవి బుల్లి బుల్లి మాటల్లో చెప్తూ తల్లి తండ్రులను సాయంకాలము ఆనంద పరవశులను చేస్తుండేది. మధ్య మధ్య ఏవేవో ప్రశ్నలు వేస్తూ జవాబు చెప్పిందాక గుక్కత్రిప్పుకోనిచ్చేదికాదు.

ఆ రోజున వాళ్లమ్మ సరళకు రెండు బొమ్మలు కొనిపెట్టింది. డాక్టరుగారు సాయంకాలము రాగానే ఆమె పరుగెత్తుకొనివచ్చి "నాన్నా! అమ్మనాకు బొమ్మలు కొనిపెట్టింది - చూపెడ్తానుండు" అంటూ గదిలోకి పారిపోయింది.

"సరళా! ఏమిటాహడావుడి! - నాన్నగారిని కాఫీ త్రాగనివ్వు తర్వాత చూపిద్దు

గాని బొమ్మలను'' అని తల్లి కేక వేసింది.

రామకృష్ణ కోటు విప్పి కుర్చీ లో కూర్చొని బూట్సులు విప్పుకుంటు '' పోనీ సీతా! కాఫీ పాటికి కాఫీ త్రాగుతూ బొమ్మలు చూస్తాను'' అన్నాడు. ముందున్న టేబిలుమీద కాఫీకప్పుతీసికొని నోటి దగ్గరకు పోనిచ్చేసరికి సరళబొమ్మలతో తయారయింది.

''నాన్నా! బొమ్మలు బాగున్నాయి కదూ - యింకా మంచివి పెద్దబొమ్మ లున్నవి నాన్నా! - అమ్మను కొని పెట్టమని అడిగితే అవి వద్దని యివి కొని పెట్టింది'' అన్నది బుంగిమూతిపెట్టి.

''పోనీలేమ్మా! - రేపు మంచివి నీకు కావలసినవాటిని కొని పెడ్తాలే'' అన్నాడు కాఫీ త్రాగుతూనే. సరళ నాన్న ప్రక్కకు చేరింది.

ఒక రోజున సరళ బళ్ళోకివెళ్లి వెంబడే తిరిగి వచ్చింది. ఎందుకని తల్లి అడిగితే వాళ్ల స్కూలు హెడ్మాష్టరు చనిపోయాడని సెలవిచ్చారని చెప్పింది.

డాక్టరుగారు ఊళ్లోపని చూచుకొని యింటికివచ్చేసరికి రాత్రి తొమ్మిదయింది. సాధారణంగా ఆ వేళ కప్పుడే సరళ భోంచేసి పండుకొని నిద్రపోయేది ప్రతి రోజూను. ఆ రోజున మాత్రం తండ్రి రాకకోరకు ఎదురుచూస్తూ కూర్చున్నది.

సీత కాళ్లకు నీళ్లిచ్చి కంచంలో అన్నము వడ్డించింది. రామకృష్ణ కాళ్ళు, చేతులు కడుక్కొని తుడుచుకుంటూ వెళ్ళి తువాలు పైన వేసుకొని అన్నంముందు కూర్చున్నాడు.

''ఏం సీతా! సరళ యింకా నిద్ర పోలేదు? - అన్నం తిన్నదా''

''మీ అమ్మాయి సంగతి మీకే తెలియాలి.''

''ఏమమ్మా సరళా! నిద్రరాలేదూ! - ఎందుకలాగ ఏదో రకంగా నున్నావు. ''

''ఏంలేదు నాన్నా!'' అంటూ ప్రక్కన కూర్చొని ''నాన్నా నేనొక ప్రశ్న అడుగుతాను జబాబు చెప్తావా'' అన్నది.

''ఏమిటమ్మా! - అంత గొప్ప ప్రశ్న''

''నాన్నా! మనుష్యు లెందుకు చచ్చి పోతారు?''

సీత అందుకొని ''ఏమిటా పిచ్చిప్రశ్న- ప్రొద్దుపోయింది-వెళ్లిపండుకో'' అని కసిరింది.

''అలా కసురుతా వెందుకు సీతా! ఏదో అడిగింది.''

''ఈవాళ వాళ్లస్కూలు హెడ్మాష్టరు చచ్చిపోయాడని శెలవిచ్చారట అది యీ ప్రశ్నకు మూలం'' దేవుడికి వాళ్లు యిక

భూలోకంలో బ్రతికియుండటం యిష్టం లేక"

"అయితే చనిపోయినవాళ్లు ఎక్కడికి పోతారు ?"

"దేవుడి దగ్గరకు"

వెంబడే సరళ "నాన్నా! అయితే చనిపోయిన వాళ్లనుచూచి ఏడుస్తా రెండుకూ! – నేను చచ్చిపోతే నీవు ఏడవవు కదూనాన్నా!" అన్నది.

"ఏమిటా పిచ్చిమాటలు! పోయి పండుకో" అని సీత సరళను చెయ్యిపట్టుకొని తీసికొని వెళ్లింది అవతలికి.

వారం రోజులు గడిచాక ఒక రోజున ప్రక్కలోనే ఉదయం సరళ నలతగా కనుపించింది. సీత లేపడానికివెళ్ళి తాకేసరికి సరళఒళ్లు కాగుతుండింది. ఏదో సాధారణమైన జ్వరమేకదాయని తానే మందివ్వ మొదలు పెట్టాడు డాక్టరు రామకృష్ణ. రోజులు గడువసాగినవికాని జ్వరం తగ్గలేదు. మరొక పెద్ద డాక్టరునుపిలిచి చూపించాడు. టైఫాయిడ్ అని నిర్ధారణ అయి చికిత్స ప్రారంభమయింది. రోజులు గడిచినకొద్దీ సరళ నీరసిస్తూ వచ్చిందికాని జ్వరం తగ్గలేదు. తల్లి పాపం! కంట్లో వత్తులేసుకొని రాత్రింపగళ్లు మంచం ప్రక్కనే యుండేది. రామకృష్ణ చేయ తగినదంతా సరళకు జ్వరం తిరుగుమొగం అగుతుందేమోననే ఆశతో చేశాడు. కాని లాభం శూన్యం. పన్నెండవ రోజున ఉదయం శాశ్వతంగా కళ్లు మూసింది. సీత భోరున ఏడ్వసాగింది. రామకృష్ణ ఏడ్వకుండా యుండి యుంటాడా ?


## శతక వాఙ్మయ సర్వస్వము

### (ప్రథమ సంపుటము)

డెమ్మి సైజున 500 పుటలు - సగము క్యాలికో బైండు. ముందుగానే సొమ్ము పంపిన వారికి పంపిన కాపీలు పోను కొలది ప్రతులుమాత్రము మిగిలియున్నవి త్వరలో ద్వితీయముద్రణకవకాశములులేవు.

చరిత్రకారులకు, పుస్తకభాండాగారములకు, కళాశాలలకు, పాఠశాలలకు, తదితరవిద్యాసంస్థలకు అమూల్యమైన గ్రంథము ఆలస్యముచేసినచో తరుణముమించిపోవును.

తపాలాచార్జీలతో కూడ ప్రతి 1కి రూ 7–8–0. వలయువారు రూ. 5–0–0ల అడ్వాన్సుతో ఆర్డరు యివ్వవలెను.

వేదము ఉదయరంజని

66 సామిపిళ్ల వీది, చూళ, మదరాసు 7.